



మదనపల్లె : వలసపల్లెలో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు



ఓటు వేయడానికి వచ్చిన వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌ అహ్మద్‌ కుటుంబ సభ్యులు





రామసముద్రం: ఓటు వేయడానికి వస్తున్న దివ్యాంగులు



రామసముద్రం: చెంబకూరులో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధులు



రామసముద్రం : మట్లవారిపల్లిలో ఓటు కోసం క్యూలో వృద్ధులు



నిమ్మనపల్లి : రాచవేటివారిపల్లెలో సాయంత్రం వరకు క్యూలో..



ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్‌ చైర్మన్‌ మనూజారెడ్డి



మదనపల్లెలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి



కురబలకోట : ముదివేడు పోలింగ్‌ కేంద్రంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ముదివేడు జడ్పీ హైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు



పెద్దతిప్పసముద్రం:రంగసముద్రంలో బారులు తీరిన ఓటర్లు



ములకలచెరువు : సోంపల్లి పోలింగ్‌ స్టేషన్‌ వద్ద బారులు తీరిన జనం

ఓటరు చైతన్యం

- ప్రశాంతంగా పోలింగ్‌
- ఉదయం 7గంటలకే బారులు తీరిన ఓటర్లు
- కొన్నిచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- కేంద్రాల్లో వసతులు లేక ఇబ్బందులు పడ్డ ప్రజలు
- గ్రామీణ ప్రాంతాల్లో ఓటెత్తిన ప్రజలు
- పోలింగ్‌ ముగిసే చివరి నిమిషంలో వర్షం
- వలసపల్లెలో కరెంటు లేక చీకట్లో పోలింగ్‌ సిబ్బంది, ఈవీఎంలు



మదనపల్లెలో బారులు తీరిన ఓటర్లు

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించి 164–మదనపల్లె నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌ ప్రశాంతంగా ముగిసింది. మదనపల్లె నియోజకవర్గంలో శాతం పోలింగ్‌ నమోదైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్‌ ప్రారంభం కాగానే ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలింగ్‌ కేంద్రాల్లో బారులు తీరారు. పలు పోలింగ్‌ కేంద్రాల్లో మాక్‌ పోలింగ్‌ సమయంలో ఈవీఎంలు మొరాయించగా అధికారులు వచ్చి వాటిని సరిచేశారు. దీంతో కొన్నిచోట్ల అర గంట నుంచి గంట ఆలస్యంగా పోలింగ్‌ ప్రారంభమైంది. వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌, భార్య తస్నీమ్‌, కుటుంబ సభ్యులతో కలిసి కోటవీధిలోని హోప్‌ మున్సిపల్‌ ఉన్నతపాఠశాలలోని పోలింగ్‌ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. మదనపల్లె నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 71 శాతం పోలింగ్‌ నమోదు కాగా ఈసారి పోలింగ్‌ సమయం 6 గంటలు ముగిసే టప్పటికి 67.2 శాతం నమోదైంది. ఉదయం 7 గంటల ప్రాంతంలో ఓటువేసేందుకు ప్రజలు ఆసక్తి కనపరిచినా, తర్వాత ఎండదెబ్బకు ఇళ్ల నుంచి రావడం మానేశారు. మధ్యాహ్నం 1 గంటలకు మదనపల్లెలో 33.60 శాతం మాత్రమే పోలింగ్‌ నమోదైంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత మెల్లమెల్లగా పోలింగ్‌ బూత్‌లకు జనం రావడం మొదలైంది. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అన్ని పోలింగ్‌ కేంద్రాల ఎదుట ప్రజలు ఓటువేసేందుకు ప్రజలు బారులు తీరారు. పోలింగ్‌ ముగిసే సమయానికి అరగంట ముందుగా వర్షం రావడంతో పోలింగ్‌ కేంద్రాల వద్ద ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రూట్‌ అధికారులు, మైక్రో అబ్జర్వర్‌లు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పోలింగ్‌ సరళిని పరిశీలించారు. పోలింగ్‌ కేంద్రాల వద్ద జనాల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో ఎన్నికల అధికారులు విఫలమయ్యారు. తీవ్రమైన ఎండలో నడిరోడ్డు మీద గంటల తరబడి ప్రజలు ఓటు వేసేందుకు నిల్చోవాల్సి వచ్చింది. పోలింగ్‌ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. కొన్నిచోట్ల ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లతో నామమాత్రంగా నిర్వహణ చేయించారు. ఎప్పటిలాగానే పట్టణ ప్రాంత ఓటర్లతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఓటేసేందుకు పోటెత్తారు. పోలింగ్‌ కేంద్రాల వద్ద దివ్యాంగులను తీసుకెళ్లి ఓటువేయించేందుకు సహాయకులు లేకపోవడంతో, కుటుంబసభ్యులే వారిని తీసుకెళ్లి ఓటు వేయించి తీసుకురావాల్సి వచ్చింది.

- మదనపల్లె మండలం వలసపల్లెలోని ఎంపీపీ పాఠశాలలో పోలింగ్‌ ముగిసే సమయానికి హఠాత్తుగా వర్షం రావడంతో, కరెంటుసరఫరా నిలిచిపోయింది. సాయంత్రం.6.30 గంటలకు వెళ్లిన కరెంటు దాదాపు గంటన్నర అయినప్పటికీ రాలేదు. అప్పటికే ఓటు వినియోగించుకునేందుకు దాదాపు 200 మందికి పైగా క్యూలైన్లో నిల్చుని ఉండటంతో గ్రామస్తులు ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటుచేసి, ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరినా, పోలింగ్‌ ఆఫీసర్‌ అంగీకరించకపోవడం కాసేపు వివాదానికి కారణమైంది.
- పట్టణంలోని రవీంద్రనాథ్‌ ఠాగూర్‌ మున్సిపల్‌ పాఠశాల పోలింగ్‌స్టేషన్‌ వద్ద టీడీపీ నాయకులు పసుపుచొక్కాలు వేసుకుని, మెడలో కండువాలు కప్పుకుని, ఓటు వేసేందు క్యూలో నిల్చున్న వారిని టీడీపీకి ఓటువేయాల్సిందిగా ప్రచారం చేయసాగారు. దీన్ని గమనించిన కౌన్సిలర్‌ పి.రాజేష్‌ అడ్డుకుంటే, అతడిపై టీడీపీ నాయకులు ఘర్షణకు దిగారు.
- స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా అనుచరుడు బాబా, సైకిల్‌కు ఓటువేయాలని ప్రచారం చేస్తుండగా, వైఎస్సార్‌ సీపీ నాయకులు లియాఖత్‌అలీ అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు.
- పట్టణంలోని రామారావుకాలనీలో టీడీపీ తరఫున మెప్మా ఆర్పీ షేక్‌ జాఫర్‌ పోలింగ్‌ ఏజెంట్‌గా కూర్చుంది. దీన్ని గమనించిన వైఎస్సార్‌ సీపీ నాయకులు పీఓకు ఫిర్యాదుచేయడంతో, ఆమె అక్కడ నుంచి వెళ్లిపోయింది.
- బీటీ కళాశాలలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా, తన వాహనాన్ని 100 మీటర్లకు అవతల ఉంచి పోలింగ్‌ కేంద్రంలోకి వెళ్లాల్సి ఉండగా, నేరుగా పోలింగ్‌ కేంద్రం వద్దకు వాహనాన్ని పోనిచ్చారు. అక్కడ ఉన్నటువంటి పోలీసులు ఆయనను అడ్డుకోకపోవడంపై స్థానికులు మండిపడ్డారు.
- కొత్తపల్లెలో టీడీపీ నాయకులు పోలింగ్‌ కేంద్రంలోకి యథేచ్ఛగా వెళ్లివస్తూ, ప్రచారం చేయడాన్ని అడ్డుకున్నందుకు వైఎస్సార్‌ సీపీ సచివాలయ కన్వీనర్‌ మహేష్‌తో వారు గొడవకు దిగారు. దాడి చేసేందుకు ప్రయత్నించారు.
- కొత్తపల్లెలో శతాధిక వృద్ధురాలు పార్వతమ్మ తన ఓటుహక్కును వినియోగించుకుంది. కోళ్లబైలు బాబూ కాలనీలోని పోలింగ్‌ కేంద్రం నెంబర్‌.5ఏను ఉమెన్‌ మోడల్‌ పోలింగ్‌ కేంద్రంగా ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు.

నిమ్మనపల్లెలో...

రెడ్డివారిపల్లె, కొండయ్యగారిపల్లె, నిమ్మనపల్లె ఎంఆర్‌సీ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌ ఆలస్యంగా ప్రారంభమైంది. ముష్టూరు, రెడ్డివారిపల్లె తదితర కేంద్రాల్లో ఈవీఎంలు మెల్లగా పనిచేస్తుండటంతో ఓటువేసేందుకు చాలా సమయం పట్టింది. సాయంత్రం 6 గంటల తర్వాత కూడా రెడ్డివారిపల్లె, రాచవేటివారిపల్లె, నిమ్మనపల్లె హైస్కూల్‌, వెంగంవారిపల్లె, బాలినాయునిపల్లె పోలింగ్‌ కేంద్రాల్లో ప్రజలు పెద్ద ఎత్తున క్యూలైన్లలో నిరీక్షించారు. దీంతో రాత్రి దాదాపు 8.30 గంటల వరకు పోలింగ్‌ కొనసాగింది. నిమ్మనపల్లె హైస్కూల్‌, మండ్యంవారిపల్లె పోలింగ్‌ కేంద్రాల వద్ద వైఎస్సార్‌ సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది.

ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్‌

తంబళ్లపల్లి: తంబళ్లపల్లిలో సోమవారం సాధారణ ఎన్నికల పోలింగ్‌ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు మహిళలు, పురుషులు ఓట్లు వేసేందుకు పెద్ద ఎత్తు పోలింగ్‌ కేంద్రాల వద్ద క్యూ లో బారులు తీరారు. వృద్ధులులు సైతం సహాయకుల సాయంతో ఓటు వేసేందుకు వచ్చారు. పోలింగ్‌ ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల నిర్వహణ అధికారులు ఊపిరి పీల్చుకొన్నారు.

ఓటేసిన ప్రముఖులు..

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు, డివిజన్‌స్థాయి అధికారులు, పలువురు ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు సోమవారం ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్‌ కేంద్రాలకు తరలివచ్చారు. తమవంతు వచ్చే వరకు క్యూలో ఓపికగా వేచి చూసి ఓటు వేశారు. మదనపల్లె ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి హరిప్రసాద్‌, ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల పోలింగ్‌ బూత్‌నెంబర్‌.192లో భార్యతో కలిసి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ దేశాయ్‌ తిప్పారెడ్డి భార్య డాక్టర్‌ శైలజా దేశాయ్‌, కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాలలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి కొండామారిపల్లెలో తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్‌.నిసార్‌అహ్మద్‌, భార్య తస్లీమ్‌, కుటుంబసభ్యులతో కలిసి ఉదయం 7 గంటల ప్రాంతంలో స్థానిక కోటబడిలోని హోప్‌ మున్సిపల్‌ హైస్కూల్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు

పెద్దతిప్పసముద్రం/ ములకలచెరువు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో మొత్తం 43 పోలింగ్‌ కేంద్రాలు ఉండగా 41,466 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 20,557 మంది ఉండగా మహిళా ఓటర్లు 20,908 మంది ఇతరులు ఒకరు ఉన్నారు. సాయంత్రం ఐదు గంటలకు మండల వ్యాప్తంగా 70.15 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పలు కేంద్రాల సరళిని పరిశీలించారు. అయితే పలు చోట్ల గంటల కొద్దీ ఈవీఎం ప్యాట్‌లు మొరాయించడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడుకున్న భారీ వర్షం కురవడంతో విద్యుత్‌ సరఫరా కూడా నిలిచిపోయింది. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కురబలకోటలో..

కురబలకోట: మండలంలో ఊహించని విధంగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోటెత్తారు. పూజారివారిపల్లె, ముదివేడు, కురబలకోటలో రాత్రి పది గంటల వరకు కూడా ఓట్లు వేశారు. ఈవీఎంలలో ఓట్లు వేయడం ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు చెబుతున్నారు. అంతేగాకుండా ఇంతలా పోలింగ్‌ జరగడం అదీ రాత్రి పది వరకు జరగడం ఇన్నేళ్లలో ఇదే ప్రప్రథమని అధికారులు, పెద్ద తరం వారు చెబుతున్నారు. సోమవారం సాయంత్రం వర్షం పడినప్పటికీ ఓటర్లు క్యూ లోనే వేచి ఉండడం గమనార్హం. మండలంలో పిచ్చలవాండ్లపల్లెలో పోలింగ్‌ బూత్‌ నెంబరు 202లో 94 శాతం పోలింగ్‌ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఓటర్లు పొటెత్తడం సంచలనంగా మారింది.





మదనపల్లెలో ఓటు వేయడానిక వస్తున్న వృద్ధులు



నిమ్మనపల్లె: ఓటు కోసం దివ్యాంగురాలు వీల్‌చైర్‌లో



మదనపల్లి: వలసపల్లి పంచాయతీ పోలింగ్‌ కేంద్రం వద్ద..



మదనపల్లెలో ఓటు వేయడం కోసం క్యూలో ఓటర్లు



మదనపల్లె: వైఎస్సార్‌ సీపీ నాయకుడు లియాకత్‌ అలీపై టీడీపీ నాయకుడు బాబా దాడి చేయడంతో ఆందోళన చేస్తున్న దృశ్యం



నిబంధనలు అతిక్రమించి మదనపల్లె బీటీ కళాశాల పోలింగ్‌ బూత్‌ వద్దకు వచ్చిన టీడీపీ అభ్యర్థి షాజహాన్‌ బాషా వాహనం



రామసముద్రం: చెంబకూరులో వృద్ధురాలిని మోసుకెళ్తున్న దృశ్యం



బి.కొత్తకోట: బడికాయపల్లెలో బారులు తీరిన ఓటర్లు



పెద్దతిప్పసముద్రం: చెన్నరాయునిపల్లెలో పోలీసుల బందోబస్తు



ములకలచెరువు : బురకాయలకోట పోలింగ్‌ స్టేషన్‌లో ఓట్లు వేయడానికి వేచి ఉన్న ప్రజలు



తంబళ్లపల్లి :కోటకొండలో బారులు తీరిన ఓటర్లు



రామసముద్రం : మట్లవారిపల్లిలో ఓటు వేయడానికి క్యూలో ఓటర్లు